# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతి క్వాంటం వ్యాలీ కింద ముప్పై కంపెనీలు త్వరలో మేధా టవర్స్ నుండి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **రాజమండ్రి విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేయాలని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరందించేలా చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **పర్యావరణ మార్పులు, సవాళ్లపై పలు శాఖలను సమన్వయం చేస్తూ.. ఈపిటిఆర్ఐ సమగ్ర ప్రణాళికను రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు చెప్పారు.**

===========================

అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్‌ఛేంజర్ అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని అమరావతిలో 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్‌తో కలిసి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్... ..30 .. సెకన్లు

---------------------------

అమరావతి క్వాంటం వ్యాలీ కింద ముప్పై కంపెనీలు త్వరలో మేధా టవర్స్ నుండి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అదనంగా, క్వాంటం కంప్యూటింగ్, అల్గారిథంలు, హార్డ్ వేర్ అభివృద్ధి, క్వాంటం భద్రత, క్వాంటం సెన్సింగ్ లలో 15 సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి క్వాంటం వ్యాలీకి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో శంకుస్థాపన జరగడం గర్వించదగ్గ అంశంగా పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి విమానాశ్రయ నూతన టెర్మినల్ పనులను మార్చి

31వ తేదీ లోపు పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. నూతన టెర్మినల్ పనులను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ ప్రాంగణంలో “ఏక్ పేడ్ మా కే నామ్ సే” కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, రాజమహేంద్రవరం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరందించేలా చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా విజ్జేశ్వరం నుండి నేరుగా పాలకొల్లు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తామన్నారు. వేడంగి గ్రామంలో అమరజీవి జలధార పథకంలో భాగంగా 63 కోట్ల రూపాయలతో రక్షిత తాగు నీటి సరఫరా పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

పల్నాడు జిల్లాలోని కొండవీడు కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కొండవీడు కోట ఉత్సవాల్లో భాగంగా, జాతీయ గీతం వందేమాతరం -- 150 సంవత్సరాలు’ అనే అంశంపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ విభాగం ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డి మట్లాడుతూ.. యావత్ దేశాన్ని ఒక్కతాటిపై నిలిపి, ఐక్యతా భావాన్ని వందేమాతర గీతం తీసువచ్చిందన్నారు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేశ్ చంద్ర మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో బంకిమ్ చంద్ర ఛటోపాధ్యాయ జీవితానికి సంబంధించిన అరుదైన, విశిష్ట చిత్రాలు, అలాగే వందేమాతరం జాతీయ గీతానికి సంబంధించిన చారిత్రక విశేషాలను ప్రదర్శించామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే “పరీక్షా పే చర్చా” 9వ సంచిక కార్యక్రమంలోని రెండోవ భాగం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి విద్యార్థులతో సంభాషిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానెల్, ఆకాశవాణి, దూరదర్శన్ లతో పాటు విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాలలోనూ ప్రసారం అవుతుందన్నారు.

---------------------------

పర్యావరణ మార్పులు, సవాళ్లపై పలు శాఖలను సమన్వయం చేస్తూ.. ఎన్విరాన్ మెంట్ ప్రొటెక్షన్, ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ సమగ్ర వ్యూహం రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. సంస్థ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం హైదరాబాదులోని సచివాలయంలో నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులపై సంస్థ కీలక పాత్ర పోషించాలన్నారు.

---------------------------

ఏలూరు జిల్లాలో ఉద్యానవన పంటల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 9 వేల 67 కోట్ల రూపాయలు ఆదాయం లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కలెక్టరేట్లో నిన్న నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాణ్యతలేని, కల్తీ విత్తనాలు కారణంగా ఏ ఒక్కరైతు కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మట్లాడుతూ.. జిల్లాలో రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సన్న చిన్నకారు రైతులకు యూరియా కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్ర ప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో వాయువ్య,ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ శాఖ అదికారి ఎం.వెంకట్రావు తెలిపారు. ఉత్తర కోస్తా, యానాం, రాలయసీమల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరంబీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిశ్రమ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. పలు చోట్ల పొగమంచు కురుస్తుంది.

---------------------------

ఐసిసి టీ20 ప్రపంచకప్‌లో తోలి మ్యాచ్ లో భారత్ జట్టు విజయం సాధించింది. ముంబాయిలోని వాంఖడే స్టేడియంలో నిన్న జరిగిన తొలిమ్యాచ్ లో అమెరికాపై 29 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అమెరికా 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులు మాత్రమే చేయగలిగింది.

=====================